క్లుప్తంగా

'జోడో యాత్ర'లో ఎడవల్లి



యాత్రలో పాల్గొన్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: ములుగు నియోజకవర్గం వెంకటాపురంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో కొత్తగూడెం నియోజకవర్గ నుంచి పీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాయల శాంతమ్మ, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, ఆంతోటిపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

పాల్వంచ: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం




రామకృష్ణ, మీనాకుమారి దంపతులను సన్మానిస్తున్న ఎండీ రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి ధన్‌బాద్ గ్రామంలో చెరువు సమీపంలో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన గొబ్బల రామకృష్ణ, మీనాకుమారి దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రజాక్ మీనాకుమారి దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మడి సాగర్, గోపు కుమార్, నాగరాజు, శనిగరపు శంకర్, యాకయ్య, లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన బంధు ప్రకటించాలి

టేకులపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశించిన మేరకు లేదని సీపీఐ జిల్లా నేత గుగులోత్ రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో లాగా కొన్ని శాఖలకే క్రమబద్ధీకరణ పరిమితం లేకుండా సింగరేణి, గ్రామ పంచా యతీ, మున్సిపాలిటీ సహా అన్ని శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 వేల గౌరవ వేతనం ప్రకటన సీపీఐ, ఏఐటీయూసీల పోరాట ఫలితమేనని, ఇతర స్కీం వర్కర్లతో సమానంగా వీరి గౌరవ వేతనం మరింత పెంచాలని, దళిత బంధు లబ్ధిదారుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు.

పేస్కేల్ అమలు చేయండి



కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ సిబ్బందికి ప్రకటించిన విధంగా ఉపాధి హామీ సిబ్బందికి కూడా పేస్కేల్ వర్తింపజేయాలని కోరుతూ పలువురు ఉపాధి సిబ్బంది మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్, డీఆర్డీఓ మధుసూదన్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల ప్రకారం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి సైతం పేస్కేల్ వర్తింపజేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు వివరించామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రెసిడెంట్ వేముల సుధాకర్, రంగా, టీఏల జిల్లా ప్రెసిడెంట్ వెంకటేష్, సత్యనారాయణ, పిల్లి నాగరాజు, రాందాస్, బాలాజీ పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు..!

- మినరల్ వాటర్ పేరిట అక్రమ వ్యాపారం
- అనుమతులు లేకుండానే అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



తాగునీటి క్యాన్లను తరలిస్తున్న దృశ్యం



నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్

పాల్వంచరూరల్: వేసవి సీజన్ రానే వచ్చింది. అప్పుడే మినరల్ వాటర్ పేరిట దోపిడీ మొదలైంది. కొంతమంది వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చేలగాటం ఆడుతున్న పరిస్థితి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా శుద్ధ జలం పేరుతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి అక్రమంగా నీళ్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే మినరల్ వాటర్ అంటూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. శుద్ధ జలపాత నిర్వహణకు ఇండియన్ స్టాండర్డ్ ఇనిస్టూట్ (ఐఎస్ఐ) నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ అవేవీ తీసుకోకుండానే పారిశ్రామిక, ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో శుద్ధ జలం పేరుతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి తాగునీటి వ్యాపారం జోరుగా చేస్తున్నారు. మండలంలో పెద్దమ్మతల్లి గుడి వద్ద, జగన్నాథపురం, కేశవాపురం, కిన్నెరసాని, లక్ష్మీదేవిపల్లిలో వాటర్ ప్లాంట్‌ను (ప్యూరిఫైడ్ వాటర్) కనీస ప్రమాణాలు పాటించకుండా తాగునీటి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇందులో కొంతమంది అనుమతులు లేకుండా అనుమతులు తీసుకున్నవారు నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. ప్రస్తుతం ఈ మినరల్(జనరల్) వాటర్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో మండలంలో అనేకమంది ప్యూరిఫైడ్ వాటర్ బిజినెస్ ప్రారంభించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. మండలంలో పది నుంచి పదిహేను వరకు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో అనుమతులు లేని ప్లాంట్లు ఉన్నాయి. వీరికి రాజకీయ అండదండలు ఉండటంతో అధికారులు కిమ్మనడం లేదని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

ప్లాంట్ల నిర్వాహకులు పన్ను ఎగవేత...

వాటర్ ప్లాంట్ల యజమానులు ఏడాదికి రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు వ్యాపారం జరిగితే ఒక్క శాతం, ఆపైవారు 14.5శాతం పన్ను చెల్లించాలి.

దీంతో రోజుకు ఎంత వ్యాపారం చేస్తున్నారో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జీఎస్టీ వంటి పన్ను కూడా చెల్లించకుండానే గుట్టుగా లాభాలు గడిస్తున్నారు.

వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉండాలి...

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ముఖ్యంగా నాలుగు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాతనే మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

పల్లెప్రాంతాల్లో అయితే గ్రామపంచాయతీ, పట్టణ ప్రాంతాల్లో అయితే మున్సిపాలిటీతోపాటు భూగర్భ జలవనరులశాఖ, వాణిజ్య పన్నులశాఖ, రెవెన్యూ, ఆహార నియంత్రణ శాఖల ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా అని శాఖల నుంచి అనుమతులు పొంది, నిబంధనలు పాటిస్తే నాణ్యమైన తాగునీరు వినియోగదారులుకు లభిస్తాయి. అంతేకాకుండా ధరలు పెంచకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోనే అవకాశం కూడా ఉంటుంది. ఎలాంటి అనుమతులు పొందకుంటే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా తాగునీటి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



నిబంధనలు పాటించని ప్యూరిఫైడ్ వాటర్ వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేసవికాలంలో వ్యాపారులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు.

– నాగిరెడ్డి, ప్రభాత్‌నగర్

నోటీసులు జారీ చేస్తాం



అనుమతులు లేకుండా శుద్ధ జలం ప్లాంట్లను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. పట్టణ, మండలలో అనుమతులు లేని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– రంగాప్రసాద్, తహసీల్దార్

అనుమతులు తీసుకోవాలి



ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు, బోర్ల ఏర్పాటు కోసం తప్పని సరిగా భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇటీవల 8 దరఖాస్తులకు అనుమతి ఇవ్వలేదు.

– బాలు, భూగర్భజల వనరులశాఖ జిల్లా అధికారి

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి



చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ హనుమంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల వద్ద విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ బి.హనుమంతరావుకు బీఎంఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జాతీయ నాయకులు మాధవనాయక్ మాట్లాడుతూ.. సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్ కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్యం అందించాలని, ప్రతి రెండు సంవత్సరాలకు సెక్యూరిటీ కాంట్రాక్టర్ మారినప్పుడు యూనిఫాం పేరుతో ప్రతిసారి రూ.3వేలు వసూలు చేస్తున్నారని, దీనివలన గార్డులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పర్మనెంట్ సెక్యూరిటీల మాదిరిగా ప్రైవేట్ వారికి కూడా డ్రెస్‌కోడ్ పెట్టాలని కోరారు. కోలిండియా మాదిరిగా సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ (కాంట్రాక్ట్) ఉద్యోగులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని, కార్పొరేట్ ఏరియాలో కొన్ని పోస్టుల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించాలని, సివిల్ డిపార్ట్‌మెంట్ ద్వారా నియమించిన కాంట్రాక్ట్ కార్మికులకు ఐఎంఈ/పీఎంఈ ఉచితంగా చేయవలసిందిగా ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయటం లేదని వెంటనే వీటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జీఎం సెక్యూరిటీ మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ప్రభాకర్‌రావు, జీవీ కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, క్రాంతికుమార్, రామారావు పాల్గొన్నారు.

ప్రజావేదికకు స్పందన కరువు

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన సామాజిక తనిఖీ రెండో విడత ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాఘవాపురం, మాలబంజర, కోయగూడెం, సర్వారం గ్రామాల తనిఖీలో వెల్లడైన వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం రూ.13 కోట్లతో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు వెలుగుచూశాయి. బుధవారం కూడా ప్రజావేదిక కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. కాగా ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువయింది.

కనీసం 100 మంది కూడా హాజరు కాలేదు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుబ్రమణ్యం, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎస్టీఎం వేణు, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి ఎస్ఆర్‌పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు రాణించాలి



డీఎస్పీని సన్మానిస్తున్న టీవీపీఎస్ నాయకులు

పాల్వంచ: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటేష్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో అభ్యున్నతి సాధించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ నయీం, అల్తాఫ్, జురబాబు, శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెవెన్యూ అధికారుల నూతన సంవత్సర డైరీని మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. రెవెన్యూపరమైన ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనలో నిర్వహించాల్సిన అంశాలపై చక్కటి సమాచారంతో డైరీని రూపొందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, సంఘం అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ట్రెజరర్ రంగప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గన్యా, డీఆర్ఓ అశోకచక్రవర్తి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

5,852 టన్నుల ధాన్యం సేకరణ

పాల్వంచ: పాల్వంచ సొసైటీ ద్వారా 2022–23 ఖరీఫ్ సీజన్‌లో 5,852 టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించడం జరిగిందని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. 859 మంది రైతులకు గాను రూ.11.95 కోట్ల విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

కొత్తగూడెంరూరల్: ఈనెల 11, 12 తేదీలలో మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జరిగే పాత్రికేయుల శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లిలో ఆయన మాట్లాడారు. పాత్రికేయుల వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రొఫెసర్ చక్రపాణి హాజరవుతారని తెలిపారు.

సామాజిక సేవ అలవర్చుకోండి

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎస్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి నర్సింగ్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఇతరులతో సోదర భావం అలవర్చుకొని సేవ చేయాలనే సంకల్పం కలిగి ఉండాలన్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు

సుజాతనగర్: సిరిపురం గ్రామానికి చెందిన ఆబోతు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. 16 సంవత్సరాల పాటు దేవుడి ఆబోతుగా ప్రాచుర్యం పొందింది. ట్రాక్టర్‌పై ఊరేగింపుగా మేళతాళాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కంటి పరీక్షలు చేయించుకోండి

సుజాతనగర్: ప్రతి ఒక్కరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సుజాతనగర్ సర్పంచ్ సీకా కృష్ణవేణి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యకమాన్ని స్థానిక హైస్కూల్‌లో మంగళవారం ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రతివారికి కళ్లు చాలా ముఖ్యమైన అవయవాలని, విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.శోభారాణి, వైద్యులు పాల్గొన్నారు.

అందరికీ 'దళితబంధు' వర్తింపజేయాలి

జూలూరుపాడు: అర్హులైన ప్రతి దళిత యువతకు దళిత బంధు పథకాన్ని వర్తింపజేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... దళిత యువత ఆర్థిక వనరులు లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. దళిత యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన దళిత యువతను గుర్తించి రాజకీయ జోక్యం లేకుండా దళిత బంధు పథకాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

జర్నలిస్ట్ మృతిపై సంతాపం



సూర్యం (ఫైల్)

సుజాతనగర్: మండలంలోని సర్వారానికి చెందిన ఓ పత్రికా విలేకరి ఇటీవల పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన భూక్యా సూర్యంరాథోడ్(33) గత నాలుగేళ్లుగా విలేకరిగా పనిచేస్తుండగా, ఈనెల 4న పంటపొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల మూలంగానే సూర్యం ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా.. సూర్యం మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

మిషన్ భగీరథ కార్మికుల అరెస్ట్



అరెస్ట్ అయిన కార్మికులు

పాల్వంచ: మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా పాల్వంచ మందరికలపాడు మిషన్ భగీరథ పైపులైన్ కార్మికులను రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు ఇస్లావత్ అనిల్ నాయక్, మాలోతు నరేశ్, సాయి, వీరభద్రం, జవహర్ లాల్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, ప్రశాంత్‌లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

గిరిజన ఉద్యోగులకు అండగా ఉండండి



ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ఉపాధ్యాయులు

టేకులపల్లి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరాంనాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం అనిశెట్టిపల్లి గ్రామానికి వచ్చిన ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో వందశాతం గిరిజనులతోనే నియామకాలు చేపట్టాలని, అడక్వెన్సీ విధానాన్ని తీసివేయాలని, 317 జీఓ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు పాత సర్వీసు పరిగణలోకి తీసుకుని బదిలీలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న కేజీబీవీ యూఆర్ఎస్ కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని ఈ సమస్యలు పరిష్కారమయ్యేలా అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో రత్నాకర్, రాంజీ, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బాలశౌరి అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు హాత్ సే హాత్ జోడో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 3,500 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిరకుంశ పాలన మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ప్రసుతం భారతదేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. బీఆర్ఎస్ పాలన వల్ల సామాన్య ప్రజలపై తీరని భారం పడుతోందన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో గద్దల రమేష్, కాపా శ్రీనివాస్, మురళీనాయక్, మాజీ ఎంపీపీ నారాయణ, రాము నాయక్, పవన్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పట్టణాభివృద్ధికి నిధులు ఏవి?

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన రాష్ట్ర బడ్జెట్‌లో పట్టణాభివృద్ధికి నిధులు లేవని, ఇప్పటికే విద్యుత్ చార్జీల పెరుగుదల, ఏడీసీ విద్యుత్ చార్జీల భారంతో పట్టణ ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవతున్నారని టీయూడీఎఫ్ పట్టణ కన్వీనర్ కొండపల్లి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రగతికి గత బడ్జెట్‌లో రూ.1,394 కోట్లు కేటాయించగా, 2023–24 బడ్జెట్‌లో రూ.1,474 కోట్లు అంటే రూ.80 కోట్ల మాత్రమే అదనంగా కేటాయించారని డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి రూ.10.18 కోట్లు కేవలం లక్ష ఇళ్ల నిర్మాణానికే కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంతోపాటు, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, మున్సిపాలిటీలల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందలేదని, పెన్షన్ దారులకు పింఛన్లు అందటం లేదన్నారు. ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రులు ఈ బడ్జెట్‌ను గొప్పగా చెప్పుకుంటున్నారని దీని వలన ప్రజలకు ఉపయోగం లేదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



ఆయిల్‌పామ్ మొక్కలు అందజేస్తున్న ఏఓ

టేకులపల్లి: ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని టేకులపల్లి ఏఓ నీరుడు అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని టేకులపల్లి, కోయగూడెం, బేతంపూడి, ప్రెగళ్లపాడు, మొక్కంపాడు, చింతోనిచెలక గ్రామాల్లో రైతులకు మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందించడమే కాక మొదటి నాలుగేళ్ల పంట సాగు నిమిత్తం ఏటా రూ.4,200 రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం చింతోనిచెలకలో రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణి, విశాల, రెహానా, సర్పంచ్ నీలమయ్య, రైతులు పాల్గొన్నారు.

అటవీ హక్కు చట్ట సవరణను రద్దు చేయాలి



జూలూరుపాడు: రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్డీ నాయకులు, పోడు రైతులు



ఇల్లెందురూరల్: ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు

జూలూరుపాడు: అటవీ హక్కు చట్ట సవరణను రద్దు చేయాలి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఉమర్ మాట్లాడుతూ.. అటవీ హక్కు చట్ట సవరణతో ఆదివాసీలకు నష్టం జరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేద గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వల్లోజి రమేష్, జె.నరసింహారావు, బత్తుల గోపి, పోడు రైతులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: నూతనంగా తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాలు – 2022 ఉపసంహరించుకోవాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. తహసీల్ ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణవేణికి అందజేశారు. న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, పూనెం కోటయ్య, పొడుగు నర్సింహారావు, రాసాల లింగం, బాలగాని శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నూతన అటవీ సంరక్షణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్‌కు వినతిపత్రం అందించారు. కుంజ కృష్ణ, వీరమల్ల ఉమ, కొండపనేని సత్యనారాయణ, వినోద, ఎండీ అఫ్జల్‌ఖాన్, నాగులు, రామయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. కిన్నెరసాని వైపు వెళ్లే ప్రధాన రహదారిలో కోడిపుంజులవాగు గ్రామ సమీపంలో ఎండిపోయిన భారీ వృక్షం కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ మార్గం ద్వారా నిత్యం పర్యాటకులు, వాహనాదారులు రాత్రిపగలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే దానిని తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ
సెల్ నంబర్ : 9603465426